క్లుప్తంగా

అమ్మవారికి ప్రత్యేక పూజలు



రేణుకా ఎల్లమ్మ అమ్మవారు

కనగల్: భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారి దేవస్థానానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు పసుపు, కుంకుమ వంటి అభిషేకాలను నిర్వహించారు. బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

5 నుంచి మహాకుంభాభిషేకం

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో గల శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ దాతలు కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5న మహాగణపతి పూజ, అఖండ దీపారాధన, రక్షాబంధన పూజాది కార్యక్రమాలు, 6న మండప పూజ, వేద పారాయణం, సహస్ర కుంకుమార్చన పూజలు, 7న బొడ్రాయి అభిషేకం, 8న శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి బోనాల సమర్పణ, అన్నదానం, శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న నాయకులు

నల్లగొండ: పట్టణ సమీపంలోని చర్లపల్లికి చెందిన రాపోలు పరమేశం భార్య ఇటీవల మృతి చెందారు. కాగా పరమేశంను చర్లపల్లి పద్మశాలి సంఘం అధ్యక్షుడు పొట్టబత్తుల సత్యనారాయణ మంగళవారం పరామర్శించి సంఘం తరఫున రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పున్న రవీందర్, కోశాధికారి రాపోల్ సతీష్ కుమార్, రాపోలు శరభయ్య, రాపోలు శ్రీనివాస్, మూడ వేణు, పసునూరి యోగానందం, గంజి కృష్ణయ్య, రాపోలు సుదర్శన్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టుకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

నకిరేకల్ : పట్టణంలోని ఏవీఎం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు నామ నికిత, రమావత్ సిద్దు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారని ఆపాఠశాల ప్రిన్సిపాల్ కందాల స్వప్నశ్రీకాంత్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ నిమ్మల శంకర్‌గౌడ్ మంగళవారం తెలిపారు. జూన్ 4 నుంచి 6 వరకు నకిరేకల్ మండలం మంగళపల్లిలో జరిగే 47వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్ల తరఫున వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య అభినందించారు.

కరాటేలో గోల్డ్‌మెడల్



గోల్డ్ మెడల్ అందుకుంటున్న ప్రణవ్

నల్లగొండ టూటౌన్: ఖమ్మంలో సుమన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 30వ జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో నల్లగొండ పట్టణానికి చెందిన షోవోలిన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా క్రీడాకారుడు అన్నెపర్తి ప్రణవ్ గోల్డ్ మెడల్ సాధించాడు. ప్రణవ్‌ను షావోలిన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా ఫౌండర్ నాంపల్లి కనకారావు అభినందించారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

నకిరేకల్: పట్టణంలోని సాయి కల్యాణ మండపంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా నకిరేకల్ దోజో ఆధ్వర్యంలో మంగళవారం కరాటే బెల్ట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ మండలాల నుంచి 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చూపినవారికి సర్టిఫికెట్లు, బెల్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో రాపోలు సుదర్శన్, కరాటే అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ అంతటి సోములుగౌడ్, ఎన్ఆర్ ట్రస్ట్ ప్రతినిధి బిచెనేపల్లి ప్రకాశ్‌రావు, రామ్‌కుమార్, ఆర్.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని నిఘా నేత్రాలు

- పలు గ్రామాల్లో మరమ్మతులకు నోచుకోని సీసీ కెమెరాలు
- దాతలు ముందుకు రావాలని కోరుతున్న ప్రజలు



మర్రిగూడ బస్టాండ్ ఎదురుగా పనిచేయని సీసీ కెమెరాలు



మర్రిగూడ చౌరస్తా వద్ద పనిచేయని సీసీ కెమెరాలు

మర్రిగూడ: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర అతి కీలకమైనది. ఏదైనా చోరీగానీ మరే ఇతర సంఘటన జరిగినప్పుడు నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు ముఖ్య భూమిక వహిస్తాయి. అయితే సీసీ కెమెరాలు నెలల తరబడి పనిచేయకపోవడంతో వాటి వల్ల ఉపయోగం ఏముందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మర్రిగూడ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల సీసీ కెమెరాలు కొన్ని నెలలుగా పనిచేయడం లేదు. అదే విధంగా మర్రిగూడ చౌరస్తా వద్ద సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఇటీవల ఈదురు గాలులు, అకాల వర్షాల కారణంగా పనిచేయడం లేదు. దీంతో రోడ్లపై జరిగే ప్రమాదాలు, ఆకతాయిలు చేసే అల్లర్ల నివారణ కష్టంగా మారింది. ఇటీవల రాంరెడ్డిపల్లికి చెందిన ఓ ద్విచక్ర వాహనదారుడు సరంపేట సమీపానికి వెళ్తుండగా మర్రిగూడ నుంచి వెళ్లిన ఓ కారు ఆ ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. వాహనం ఆచూకీ లభించలేదు. ఇలాంటి సంఘటనలు ఈ మధ్య కాలంలో చాలా జరిగాయి.

ఆరు గ్రామాల్లో సీసీ కెమెరాలు..

మర్రిగూడ మండల పరిధిలో 18 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అందులో తిరగండ్లపల్లి, యరగండ్లపల్లి, మర్రిగూడ, శివన్నగూడ, ఖుదాబాక్షపల్లి, లెంకలపల్లి గ్రామాల్లో దాతల సహకారంతో ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మిగతా 12 గ్రామపంచాయతీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. కాగా తిరగండ్లపల్లి, లెంకలపల్లి, మర్రిగూడ గ్రామాల్లో కూడా ప్రస్తుతం సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఒక గ్రామంలో ఐదు నుంచి పది మంది ఆశావహులు సర్పంచ్ లేదా ఎంపీటీసీ పదవి చేపట్టాలని ముమ్మర ప్రయత్నాలు చేపడుతున్నారు. అందులో ఎవరైనా ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

యువత ముందుకు రావాలి



“ యువత తమ గ్రామంలో కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ముందుకు రావాలి. నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర వహిస్తాయి. యువతతోపాటు రాజకీయాల్లోకి వచ్చే ఉత్సాహవంతులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

–జింకల కొండలుముదిరాజ్, రాజాపేటతండా

మరమ్మతులు చేపట్టాలి



“ దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొన్ని నెలలుగా పనిచేయడం లేదు. వాటికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. ఈ నేఘా నేత్రాలు ఉండడం వల్ల నేరాలు అదుపులో ఉంటాయి. సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టి పనిచేసే విధంగా దాతలు చర్యలు తీసుకోవాలి.

–బూరుగు నాగరాజు గుప్తా, మర్రిగూడ

ప్రతి ఎకరానికి సాగు నీరు అందిస్తా

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

మునుగోడు: రానున్న మూడేళ్లలో మునుగోడు నియోజకవర్గంలోని ప్రతి ఒక ఎకరానికి సాగు నీరు అందిస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మునుగోడులోని రైతు వేదికలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆదర్శ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ శివనగూడెం, కిష్టరాయినిపల్లి రిజర్వాయర్లలో నీరు నింపేందుకు అవసరమైన ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. నియోజకవర్గంలోని 148 చెరువులతోపాటు పలు ఫీడర్ చానల్‌ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించానన్నారు. యువ రైతులు ఉద్యానశాఖ అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటిస్తూ ఉద్యాన పంటలు సాగుచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ జిల్లా అధికారి అనంత రెడ్డి, మునుగోడు డివిజన్ అధికారి విద్యాసాగర్, మండల వ్యవసాయ అధికారి పద్మజ పాల్గొన్నారు.

రైతును సన్మానించిన ఎమ్మెల్యే

మునుగోడు: ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ పట్టా రద్దు చేసుకుని పాఠశాల నిర్మాణానికి భూమి వదులుకున్న రైతు మేడి ముత్తయ్యను మంగళవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సన్మానించారు. మునుగోడు నియోజకవర్గానికి ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేసింది. కాగా మునుగోడులో పాఠశాల నిర్మించాలని.. అందుకు అవసరమైన స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అయితే అధికారులు సర్వే నంబర్ 78లో భూమిని సిద్ధం చేస్తుండగా అందులో ప్రభుత్వ పట్టా కలిగిన ముత్తయ్య పాఠశాల నిర్మాణానికి తాను సహకరిస్తానని ముందుకు వచ్చి భూమిని వదిలేశాడు. దీంతో ఎమ్మెల్యే అతడిని అభినందించి సన్మానించారు. ముత్తయ్యలాగా ఇతర రైతులు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. అనంతరం భూ సేకరణ విషయమై చండూరు ఆర్డీఓ, స్థానిక తహసీల్దార్ ఇతర సిబ్బందితో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలోగల శ్రీ కంఠ మహేశ్వరస్వామి సురమాంబ, వనం ఎల్లమ్మ తల్లి ఉత్సవాల ఆహ్వాన పత్రికను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి గౌడ సంఘం నాయకులు మంగళవారం మునుగోడు క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ నెల 7 నుంచి 9 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, కుక్కడపు ముత్యాలుగౌడ్, పులిమామిడి నర్సింహారెడ్డి, మహేష్‌గౌడ్, రియాదయ్య, గ్యార వెంకటేష్, జమ్ముల వెంకటేష్‌గౌడ్, వెంకటమరమణ, శ్రీరాములుగౌడ్, అంజయ్యగౌడ్‌లు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండ: భవిత కేంద్రం నిర్మాణ పనులపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: ప్రభుత్వ నిబంధనల ప్రకారం భవిత కేంద్రాల్లో తప్పనిసరిగా ర్యాంప్, రెయిలింగ్, టాయిలెట్లు, తాగునీరు సదుపాయం లాంటి మౌలిక కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో భవిత కేంద్రం నిర్మాణ పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. అన్ని వసతులు ఉండేలా చూడాలని, యాక్టివిటీ రూమ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. భవిత కేంద్రాలు సద్వినియోగం అయ్యేలా నిర్మాణాలు చేపట్టాలని అసిస్టెంట్ ఇంజనీర్ రాజేష్‌ను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్ రెడ్డి తదితరులు ఉన్నారు.

భవిత కేంద్రం భవనం పరిశీలన

తిప్పర్తి : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న భవిత కేంద్రం పనులను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవనంలో ర్యాంప్, రెయిలింగ్, టాయిలెట్ వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట మండలంలోని వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

సన్న ధాన్యం సాగు ప్రోత్సహించేందుకు ‘రైతన్న నేస్తం’

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నకిరేకల్: విత్తన కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



కనగల్: రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ సునీతదేవి

నకిరేకల్: రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్న బియ్యం అందిస్తున్నందున సన్న రకం ధాన్యం పంటల సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన నాణ్యమైన విత్తనం –రైతన్నకు నేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొని అభ్యుదయ రైతులకు వరి, పెసర నాణ్యమైన విత్తనాల కిట్లను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు రామాంజనేయులు విజయలక్ష్మీ, డాక్టర్ శంకర్‌లు కేఎన్ఎం 1638, ఎంజీజీ355 పెసర రకం విత్తనాల సాగుపై సూచనలు చేశారు. ఏడీఏ ఎండీ జానిమియా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు నాగులంచ వెంకటేశ్వరావు, నంద్యాల భిక్షం రెడ్డి, ఏనుగు రఘుమారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు ఏసుపాదం, వెంకన్న సుక్కయ్య, శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం

కనగల్: పంట సాగులో నాణ్యమైన విత్తనం పాత్రను గుర్తించి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ సంవత్సరం నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కనగల్ మండల కేంద్రంలోని రైతు వేదిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో విత్తన పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రొఫెసర్(కీటక శాస్త్ర విభాగం) డా.సునీతదేవి కార్యక్రమానికి హాజరై రైతులను విత్తనాలు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పంటలో నాణ్యమైన విత్తనాన్ని వాడినప్పుడు దిగుబడులు కనీసం 10 నుంచి 15శాతం వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో ఎంపికైన ముగ్గురు నుంచి ఐదుగురు అభ్యుదయ రైతులకు వ్యవసాయ పరిశోధన సంస్థల ద్వారా ఉత్పత్తి చేసిన నాణ్యమైన విత్తనం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బెజవాడ అమరేందర్ గౌడ్ ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి ఏఈఓ విజయలక్ష్మీ రైతులు పాల్గొన్నారు.

పంటల మార్పిడితోనే ప్రయోజనం

మర్రిగూడ: రైతులు ఎప్పుడు ఒకే పంటను సాగు చేయకుండా పంటల మార్పిడితో అధిక లాభాలు గడించవచ్చని మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం మర్రిగూడ మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద మునుగోడు ఏడీఏ వేణుగోపాల్ అధ్యక్షతన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సురేష్ సమక్షంలో నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎస్ఎం 1631 వరి, ఎంజీజీ 385 పెసర్ల విత్తనాలను రైతులకు ఉచితంగా అందజేశారు. రైతులు సాగు చేసిన నాణ్యమైన విత్తనాలను తిరిగి ఇతర రైతులకు అందించాలన్నారు. ఏఓ సాహస్, ఏఈఓలు విజయ్‌కుమార్, సుజాత, స్వాతి, అరుణ, రాధిక, శ్రీలత పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



నకిరేకల్ : ప్రచార జాతాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. మన పిల్లలను మన ఊరి బడిలో చేర్పించాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ ప్రచార జాతను నకిరేకల్‌లో మంగళవారం ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాలు హక్కులనే కాదు బాధ్యతలను గుర్తించి ప్రచార జాతా చేపట్టడం అభినందనీయమన్నారు. సర్కార్ బడులపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపించకపోవడం కార్పొరేట్ స్కూళ్లకు వరంలా మారిందన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, ఆయా మండలాల అధ్యక్ష కార్యదర్శులు తాటిపాముల నర్సింహమూర్తి, ఆర్.రాకేష్, పి.జయసాగర్, కే.శ్రీనివాస్, కె.రవికుమార్, ప్రతినిధులు జి.శ్రీలత, ఎర్ర సైదమ్మ, వేణుగోపాల్, లింగాల నగేష్, చక్రపాణి, కిశోర్, హరికృష్ణ, శ్యామయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

మునుగోడు: ప్రభుత్వ పాఠశాలలను ప్రజలు కాపాడుకోవాలని మునుగోడు మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతాను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామలింగయ్య, గేర నర్సింహ, మండల అధ్యక్ష, కార్యదర్శులు మిక్కుమల్ల రాములు, పరిక నర్సింహ, గంగాధర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి మండలంలో..

కేతేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంచి పాఠశాలలను కాపాడుకుందామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కేతేపల్లి, ఇనుపాముల, చీకటిగూడెం తదితర గ్రామాల్లో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌రోల్‌మెంట్ ప్రచార జాతా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో చిత్తలూరి సత్యనారాయణ, పి.రమేష్, జయసాగర్, బొజ్జ శ్యామయ్య, రవికుమార్, సీహెచ్.కిశోర్, హరికృష్ణ, వేణుగోపాల్, కె.శ్రీనివాస్, చక్రపాణి, సీపీఎం నాయకులు బొజ్జ చినవెంకులు, సీహెచ్.లూర్దుమారయ్య, సుధీర్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



నార్కట్‌పల్లి : సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు

కట్టంగూర్ : గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ఫ్రాంక్లిన్ ఆల్‌బర్ట్ అన్నారు. మంగళవారం కట్టంగూర్ మండలంలోని మల్లారం, తిమ్మాపురం(పరడ) గ్రామాల్లో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తిమ్మాపూర్ గ్రామంలో 21 దరఖాస్తులు, మల్లారంలో 9 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ప్రియదర్శిని, శ్రీనివాస్, ఊర్మిళ, రవి, బాలరాజు, భాగ్యలక్ష్మి, రఘు, సంతోష్, స్వామి, అరవింద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిట్యాల : మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో మంగళవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.కృష్ణ నాయక్, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ నర్ర వినోదమోహన్‌రెడ్డి, డీటీ విజయ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: మండలంలోని గూడపూర్, జమస్థాన్‌పల్లి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గూడపూర్ గ్రామంలో 15 మంది రైతులు, జమస్థాన్‌పల్లి గ్రామంలో ముగ్గురు రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ ఎన్.నరేష్ తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జునరెడ్డి, ఆర్ఐ వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

మర్రిగూడ : భూ భారతి చట్టం అమలులో భాగంగా మంగళవారం మర్రిగూడ మండలంలోని సరంపేట, బట్లపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. సరంపేట గ్రామంలోని రైతుల నుంచి 141, బట్లపల్లి గ్రామంలో 32.. మొత్తం 173 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు. డీటీ కె.చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనునాయక్, ఆర్ఐలు పాండురంగారెడ్డి, జహీరొద్దిన్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : మండలంలోని పోతినేనిపల్లి, సబిడిగూడెం గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దారు వెంకటేశ్వర్‌రావు, నాయబ్ తహసీల్దార్ ఆర్.రామకృష్ణ, ఆర్ఐ తరుణ్, సర్వేయర్ శ్రీనివాస్, అదనపు ఆర్ఐ భవాని పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలంలోని కొప్పోలు, ఇప్పలగూడెం గ్రామాల్లో అధికారులు మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కొప్పోలు గ్రామంలో 51, ఇప్పలగూడెం గ్రామంలో 40 దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరించామని ఇన్‌చార్జ్ తహసీల్దారు ఎంఏ సత్తార్ తెలిపారు.

కనగల్ : మండల పరిధిలోని శాబ్దుల్లాపురం, బొమ్మెపల్లి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. శాబ్దుల్లాపురంలో 27, బొమ్మెపల్లి గ్రామంలో 26మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నట్లు తహసీల్దార్ పద్మ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఎర్రమాద విష్ణువర్ధన్‌రెడ్డి, గాలెంక నాగరాజు పంచాయతీ కార్యదర్శి కారింగు రవి సిబ్బంది పాల్గొన్నారు.

గట్టుప్పల్ : మండల పరిధిలోని అంతంపేట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలకు సంబంధించి గ్రామంలో ఐదుగురు దరఖాస్తులు చేసుకున్నారని తహసీల్దారు రాములు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుకన్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని ఉప్పలంచ, రామాంజాపురం, తుడిమిడి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరి, మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి వైస్‌చైర్మన్ నర్సింహ, పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థి ప్రతిభ



రుత్విక్ మణిసాయి

నల్లగొండ: జిల్లా కేంద్రానికి చెందిన మురారిశెట్టి రుత్విక్ మణిసాయి జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరీ లో 131వ ర్యాంక్ సాధించాడు. మణిసాయి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదివాడు. మణిసాయి తల్లిదండ్రులు రాధ–శ్రీనివాస్ ప్రభుత్వ ఉపాధ్యాయులు.

వ్యక్తి అదృశ్యం



రాములు

తిప్పర్తి : వ్యక్తి అదృశ్యమైన సంఘటన తిప్పర్తి మండలంలోని మల్లేపల్లివారిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. తిప్పర్తి ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిల్లలమర్రి రాములు (85) కొన్ని రోజులుగా మతిస్థిమితం కోల్పోయి ఈ నెల 2న తెల్లవారుజామున ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో రాములు కొడుకు పిల్లలమర్రి అశోక్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వైభవంగా గంగదేవమ్మ జాతర



డోలు మోగిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

కేతేపల్లి: మండలంలోని కొప్పోలు గ్రామంలో యాదవులకు ఆరాధ్య దైవమైన గంగదేవమ్మ జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యాదవులంతా ఉదయమే ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై గంగదేవమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. పసుపు, కుంకుమలతో అందంగా అలంకరించిన బోనాలను మహిళలు నెత్తిన పెట్టుకుని డప్పు, వాయిద్యాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. బోనాలలో వండిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని దేవతను వేడుకున్నారు. ఓ లింగా.. ఓ లింగా అంటూ యాదవ యువకులు భేరీలు తిప్పుతూ సంప్రదాయ రీతిలో చేసిన నృత్యాలు అలరించాయి. వేడుకల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వేర్వేరుగా పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. డోలు వాయించి యాదవ ప్రజలను ఉత్సాహ పరిచారు. వేడుకల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కె.శ్రీనివాస్‌యాదవ్, మారం వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, నాయకులు కొప్పుల ప్రదీప్‌రెడ్డి, కప్పల సైదులు, బోళ్ల ప్రభాకర్‌రెడ్డి, చిమట వెంకన్న, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల యోగా వాక్



నల్లగొండ టౌన్: యోగా వాక్‌లో పాల్గొన్న హమాలీలు

నల్లగొండ టౌన్: అంతర్జాతీయ యోగా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం నల్లగొండలో యోగా గురువు సింగం ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో హమాలీలతో యోగా వాక్ నిర్వహించారు. కార్యక్రమంలో వేలాద్రి, వి.కోమల, మారయ్య, రవి, వెంకన్న, రమేష్ పాల్గొన్నారు.

చిట్యాలలో యోగా వాక్

చిట్యాల: అంతర్జాతీయ యోగా మాసోత్సవాల్లో భాగంగా ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్, చిట్యాల హోమియో డిస్పెనరీ ఆధ్వర్యంలో చిట్యాల పట్టణంలో మంగళవారం యోగా వాక్ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ తయ్యాబా కౌసర్, యోగా ఇన్‌స్ట్రక్టర్ ప్రసాద్, వైష్ణవి, ఫార్మసిస్ట్ సరిత, ఆశా కార్యకర్తలు జయమ్మ, సైదమ్మ, శైలజ, గీత రజిత, కవిత పాల్గొన్నారు.

గీత వృత్తిని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న వీరస్వామి

నల్లగొండ టౌన్: ప్రభుత్వం గీత వృత్తిని నిర్వీర్యం చేస్తూ గీత కార్మికుల పొట్టలు కొడుతోందని గీతా పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి అన్నారు. మంగళవారం నల్లగొండలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన గీత పనివారల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలని, తాటి, ఈత, ఖర్జూర చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను అరికట్టాలని, ట్యాంక్ బండ్‌పై మాజీ ఎంపీ ధర్మభిక్షం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ చనిపోయిన గీత కార్మికుల పింఛన్ వారి భార్యలకు వితంతు పింఛన్‌గా మార్చి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సురిగి చలపతి, వనం వెంకన్న, నకరికంటి స్వామి, లెనిన్, అక్కలయ్య పాల్గొన్నారు.

కంఠమహేశ్వర స్వామి ఉత్సవాలు ప్రారంభం



కళాకారుల ప్రదర్శన

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల గ్రామంలో శ్రీ కంఠమహేశ్వర స్వామి సురమాంబ దేవి ఆలయ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా గ్రామంలో గౌడ కులస్తులు జల బిందెలతో ఊరేగింపుగా వచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. మహిళలు మంగళ హారతులు, పురుషులు మాలలు ధరించి జల బిందెలు, డప్పు చప్పుళ్లతో సామూహికంగా వచ్చి గౌడ జెట్టిలతో ప్రత్యేక పూజలు చేశారు. కంఠమహేశ్వర స్వామి, ఎల్లమ్మ, వన మైసమ్మ దేవతా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. గౌడ జెట్టీల కళాకారులు గౌడ పురాణం కథలతో ఆకట్టుకున్నారు. వేడుకల్లో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కొప్పు నర్సయ్యగౌడ్, వెంకటేషం, కొప్పు సత్తయ్య, కోటగిరి సత్తయ్య, పుట్ట జానయ్య, కొల్లు నాగయ్య, నర్సయ్య, పసూనూరి సైదులు, టంగుటూరి సైదులుగౌడ్, కొల్లు నరేష్ పాల్గొన్నారు.